www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 22 డిసెంబర్ 2024
5
చిత్తూరు



వామ్మో.. ఇవి ఏం కొమ్ములు..



ప్రజాశక్తి- పూతలపట్టు: తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారికి చెందిన శ్రీకృష్ణుని భక్తులు తిరుపతిలోని ఇస్కాన్ టెంపుల్ వరకు రథయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ రథయాత్ర శనివారం పూతలపట్టు మండలానికి చేరుకుంది. ఇందులో పెద్ద విశేషం లేకపోయినా.. రథాన్ని ఈడ్చేందుకు ఉన్న ఎద్దులు మాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎప్పుడు ఎక్కడ చూడని విధంగా ఎద్దులకు ఉన్న పెద్దపెద్ద కొమ్ములు మండల ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రజలు దారి పొడవునా ఎద్దులను ఫోటోలు తీసుకోవడానికి ఎగబడ్డారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

- పరామర్శించిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి
- మృతుని కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: ఏనుగు దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలోని కుప్పనపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప (62) రోజులాగే శనివారం కూడా పశువులను మేత కోసం అడవికి తోలుకెళ్లాడు. పశువులను అడవిలోకి తోలుతుండగా పొదలచాటున ఉన్న ఏనుగు ఒక్కసారిగా శంకరప్పపై దాడి చేసింది. అనంతరం అక్కడి నుంచి అడవిలోకి వెళ్లిపోయింది. శంకరప్ప ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి వెతికారు. తీవ్రంగా గాయపడిన శంకరప్ప పొదలచాటున పడి ఉండటాన్ని గమనించి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైదులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏనుగుల దాడుల్లో మనుషుల ప్రాణాలు పోతున్నా, పంట నష్టం వస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తాము పంటలతోపాటు ప్రాణాలను కోల్పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

పరామర్శించిన ఎమ్మెల్యే

పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం పాతపేట పంచాయితీ కుప్పనపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప ఏనుగు దాడిలో మృతిచెందరం చాలా బాధాకరమని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో పశువులను మేపుకుంటున్న శంకరప్పపై మదపటెనుగు దాడి చేయడంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక అధికారులు కలిసి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. శంకరప్ప మృతదేహాన్ని పరిశీలించి సంఘటన పై అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుడు శంకరప్ప వికలాంగుడు కావడంతో ఏనుగు భారీ నుంచి తప్పించుకోలేకపోయాడని అధికారులు వివరించారు. అనంతరం మృతుని కుటుంబీకులను ఆయన పరామర్శించి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి మరింత పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో నారాయణ, ఆసుపత్రి ఆర్ఎంఓ శారదా దేవి, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.



పలమనేరు ఆసుపత్రిలో మృతుడు శంకరప్ప కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ఏనుగు దాడిలో మృతి చెందిన శంకరప్ప

ఏనుగుల కట్టడికి
యుద్ధ ప్రాతిపదికన చర్యలు

ఏనుగుల దాడులను నివారించి పంట, ప్రాణనష్టం జరగకుండా కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని, త్వరలో కుంకి ఏనుగుల ఏర్పాటుతో ఏనుగులను కట్టడి చేసేందుకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతవరకు అటవీ సమీప ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

ఒత్తిడి వద్దు

- ఉపాధ్యాయులకు ప్రశాంత వాతావరణం కల్పించండి..
- గాంధీ విగ్రహం ఎదుట యుటిఎఫ్ కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రోడ్డు ప్రమాదంలో అసువులు బాసిన సిద్ధయ్య శెట్టి మృతికి సంతాపంగా శనివారం డీఈఓ కార్యాలయం నుండి గాంధీ విగ్రహం వరకు యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ అనాలోచిత నిర్ణయాల వలన చాలా తీవ్రమైన ఒత్తిడిలో ఉపాధ్యాయులు పనిచేస్తున్న నేపథ్యాన్ని గుర్తుచేస్తూ, భవిష్యత్తులోనైనా రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయులకు చదువు చెప్పే పరిస్థితి కల్పించాలని, లేనిపక్షంలో పరీక్షలను సైతం బాయ్ కాట్ చేయడానికి సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, జిల్లా నాయకులు గౌరవాధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు కె.రెడ్డెప్ప నాయుడు, ఎస్.రెహానా బేగం, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌పి.బాషా, జిల్లా కార్యదర్శులు కె.సరిత, పంటపల్లి సురేష్, కె.గణేష్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సాధన కుమార్, మోహన్‌రెడ్డి, చంద్ర, నాగరాజ, రాజేష్ కుమార్, మునికృష్ణయ్య, అరుణ్ కుమార్, సారథి, రవీంద్ర, మహేష్, చిరంజీవి, భాను ప్రకాష్, లీలావతి, దామోదర్ నాయుడు, వడివేలు, యోగేశ్వర నాయుడు, వాసుదేవ, సతీష్ పాల్గొన్నారు.



సిద్ధయ్య శెట్టి మృతికి యుటిఎఫ్ కొవ్వొత్తుల నివాళి

సదస్సులు సరే సామీ...
సమస్యలు ఎప్పుడు తీరుతాయ్..

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భూ సమస్యలే అధికంగా వస్తున్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కార దిశగా భూ సమస్యలను శాశ్వత పరిష్కారం చూపుతామంటూ ప్రజలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదు ప్రభుత్వమే ప్రజల వద్దకు వచ్చి పరిష్కారం చూపుతాం... అంటూ గ్రామీణ ప్రాంతాల్లో డిసెంబర్ 6వ తేదీ నుండీ వచ్చే ఏడాది జనవరి 8వ తేది వరకు జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. 33 రోజుల పాటు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు భూ సమస్యలు, దారి సమస్యలు, డికెటి, మ్యుటేషన్, భూ దురాక్రమణలు ఫ్రీహోల్డ్, మ్యుటేషన్, డీకేటి, రీ సర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు భూ సమస్యలు పరిష్కరించాలి అంటూ భూమి పట్టాలు, అర్జీలు చేతబట్టుకొని గ్రామీణులు గంటల తరబడీ నిరీక్షిస్తూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. సదస్సులు సరే సామీ.. సమస్యల లెప్పుడు పరిష్కరిస్తారంటే అధికారుల నుండీ సమాధానం రావడం లేదు. ఈనెల 6వ తేది నుండీ చిత్తూరు జిల్లాలో 822 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు ప్రారంభమ్యాయి. ఈనెల 20వ తేదీ శుక్రవారం నాటికి 380 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి చేశారు. ఈనెల 20 తేది నాటికి 6,562 ఫిర్యాదులు అధికారులకు అందాయి. ఒక్క 20వ తేదీనే 577 ఫిర్యాదులు అందాయంటే రెవెన్యూ సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 23,961 మంది రెవెన్యూ సదస్సుల్లో జనం పాల్గొన్నారు. 33 రోజుల పాటు జరగన్న రెవెన్యూ సదస్సులో మరిన్ని రెవెన్యూ సమస్యలు అధికారులు ఫిర్యాదుల రూపంలో అందే అవకాశాలున్నాయి. ఈ సదస్సులు ప్రజల నుండీ అందుతున్న ఫిర్యాదులను పరిష్కరించేలా ఆలస్యం చేయకుండా రెవెన్యూ అధికారుల, సిబ్బంది ద్వారా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. గత రెవెన్యూ సదస్సులా కాకుండా రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పిల్లలందరికీ
ఆర్‌బిఎస్‌కే స్కానింగ్ చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వైద్యాధికారులకు శనివారం కాయకల్ప, నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ స్టాండేడ్ ఆర్‌బిఎస్‌కే స్క్రీనింగ్ ప్రోగ్రాంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా హాస్పిటల్స్‌లో పారిశుధ్యం, అంటువ్యాధుల నుంచి రక్షణ నిమిత్తమై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కాయకల్ప స్టాండర్డ్స్ మైంటైన్ చేస్తే వారికి పారితోషకపు అవార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే ఆర్‌బిఎస్‌కే స్క్రీనింగ్ ప్రోగ్రాం కింద అంగన్వాడీ పిల్లలకు, స్కూల్ పిల్లలందరికీ స్కానింగ్ చేయాలని, ఏ విధంగా క్వాలిటీగా స్క్రీన్ చేయాలో వివరించారు. ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్, డిస్టిక్ క్వాలిటీ మేనేజర్ డాక్టర్ దీప్తి, డిస్టిక్ క్వాలిటీ కన్సల్టెంట్ డాక్టర్ నిరంజన్ ఫెసిలిటేటర్లుగా, జిల్లాలోని వివిధ పిహెచ్‌సిల వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి

రూ.1.44 కోట్లతో 21 బోర్లు

వార్డుల్లో బోర్లు, మోటార్లను ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల



బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల నీటి కష్టాలు తీర్చడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని, గడిచిన రెండు నెలల్లో రూ.1.44 కోట్ల వ్యయంతో 21 బోర్లు తవ్వి, మోటార్లు బిగించినట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. శనివారం నగరంలో పలు వార్డుల్లో నూతనంగా తవ్విన బోర్లు, బిగించిన మోటార్లను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కారం కోసం యుద్ధ ప్రాతిపదికన బోర్లు వేసి మోటార్లు బిగించినట్లు చెప్పారు. ఇటీవల తవ్విన అన్ని బోర్లలో పుష్కలంగా నీరు రావడంతో నీటి సమస్య తీరి స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేయడం సంతప్తినిచ్చిందన్నారు. ఇదే తరహాలో నగరంలో రోడ్లన్నింటిని బాగు చేయిస్తామన్నారు. శనివారం 47వ డివిజన్ పై కాలనీ, 48వ డివిజన్ గాండ్ల వీధి, 45వ డివిజన్ మంగసముద్రం, 35వ డివిజన్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, 28వ డివిజన్ షౌకారు కాలనీలో బోరు మోటర్లను ప్రారంభించారు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు ఆస్పత్రి అధికారులు, వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ ఎస్.అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, టిడిపి డివిజన్ ఇన్‌ఛార్జులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పారిశుధ్య పనులు

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో పారిశుధ్యం లోపించడంపై ఎంఎల్‌ఏ గురజాల జగన్ మోహన్ స్పందించి అప్పటికప్పుడే జేసిబి ద్వారా పిచ్చిమొక్కల తొలగించాలని ఆదేశించారు. అలాగే రోగుల అవసరాలను తీర్చేలా బోరు మోటర్‌ను ప్రారంభించారు. బోరు మోటర్ ప్రారంభానికి వచ్చిన ఎంఎల్‌ఏ దృష్టికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని కొన్ని సమస్యలను సూపరింటెండెంట్ అరుణ్ కుమార్ తీసుకొచ్చారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వైద్యం, ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు ఎంఎల్‌ఏ తెలిపారు.

పరిశ్రమల రాకతో ఉద్యోగావకాశాలు

- మహిళలతో ముఖాముఖి
- విద్యార్థినులతో సహపంక్తి భోజనం
- వినతుల స్వీకరణ
- మూడో రోజూ భువనేశ్వరి పర్యటన



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న నారా భువనేశ్వరి


ప్రజాశక్తి - రామకుప్పం : ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో కుప్పంలో అభివృద్ధి పరుగులు పెట్టడం ఖాయమని ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో చిన్నాభిన్నమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే సామర్థ్యం చంద్రబాబుకి మాత్రమే ఉందని ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. 3వ రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం రామకుప్పం మండలంలో భువనేశ్వరి విస్తృతంగా పర్యటించారు. మొద్దులవంక గ్రామం, గాంధీనగర్‌లో మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. దారి పొడవునా పూలుపరిచి, డప్పు వాయిద్యాలు, జానపద గీతాలతో గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం విజలాపురంలోని కస్తూర్బా పాఠశాలను భువనేశ్వరి సందర్శించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్ల కుప్పంలో అభివృద్ధి అనే మాట లేకుండా చేశారు. మీరు చంద్రబాబుని గెలుపించుకుని అభివృద్ధికి బాటలు వేసుకున్నారని అన్నారు. రాబోయే ఐదేళ్లలో అభివృద్ధిలో కుప్పం దేశానికే ఆదర్శంగా నిలవబోతోంది. కుప్పంను మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దాలనే చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా 'కడా' అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజ్ నిర్మాణం కోసం రూ.110 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం, గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించడంలో భాగంగా ఏరియా ఆస్పత్రుల మరమ్మతుల కోసం కోటి 40 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, కుప్పం మున్సిపాలిటీలో సుమారు వెయ్యి లైట్లు కొనుగోలు చేసి వీధి దీపాలను అమర్చారని, పేదల ఆకలి తీర్చేందుకు కుప్పంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు జరిగిందని వచ్చే ఏడాది జూలై నాటికి హంద్రీ నీవా పూర్తయితే అందరికీ నీటి కష్టాలు తీరుతాయని అన్నారు. మహిళలు తమకు అందివచ్చిన అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా నిలబడాలన్నారు. కుప్పం పరిసరాల్లో పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ రాబోతున్నాయని, కుప్పంలో పరిశ్రమల రాకతో వలసలు శాశ్వతంగా ఆగిపోతాయని తెలిపారు. బీసీ, మైనారిటీ వర్గాలకు కమ్యూనిటీ హాల్ నిర్మించబోతున్నామని, ద్రావిడ యూనివర్శిటీ లో జీతాలు అందక రెండేళ్లుగా సిబ్బంది ఇబ్బందులు పడ్డారని రూ. 2.8 కోట్ల పెండింగ్ త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. అంతేకాకుండా కుప్పంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని విజలాపురంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అత్యాచారాలు తగ్గాయని, గంజాయి రక్కసిపై ఉక్కుపాదం మోపేందుకు చంద్రబాబు కఠిన చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. స్కూల్‌లో అభివృద్ధి పనులపై వినతిపత్రం తీసుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపిఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, డాక్టర్ సురేష్, మునస్వామీ, పత్ర నారాయణ, ఆనంద్‌రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, చిన్నికృష్ణ, చలపతి, సీతాపతి, శ్రీనివాసులు రెడ్డి, కన్నన్, సుబ్రీ, బాలు, అవినాష్, ఆదిల్, మంజునాథ్, జయశంకర్, శంకర్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు టోల్ ఫ్రీ

కుప్పం టౌన్ : ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి తన పర్యటనను మూడవరోజు కుప్పం పట్టణంలో కొనసాగించారు. ఇందులో భాగంగా పట్టణ టిడిపి కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబుల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ టోల్ ఫ్రీ నెంబర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ఎమ్మెల్యే, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకురావడానికి టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోనికి తీసుకురావడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను 9640622226 నెంబరు ద్వారా నేరుగా బాబు దృష్టికి తీసుకోవచ్చు అని తెలిపారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

జెడ్‌పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు



రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి- వి.కోట: విద్యార్థులు అన్ని రంగాల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ముందుకు సాగాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక రాగశ్రీ దివ్యజ్ఞాన పాఠశాలలో శనివారం నేషనల్ మాథ్స్ డే ఉత్సవాలు ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ శ్రీనివాసులు విచ్చేసి మాట్లాడుతూ నేటి విద్యార్థులు అన్ని రంగాలలో ముందు ఉండాలని సూచించారు. రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నేషనల్ మాథ్స్ డేని జరపడం చాలా సంతోషంగా ఉందన్నారు. వికోటలో అగస్త్య ఫౌండేషన్ వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అగస్త్య ఫౌండేషన్ అధికారులు డాక్టర్ ఉదయ్ కుమార్, మురళీ, పార్థసారథి విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఆగస్త్య ఫౌండేషన్ దేశవ్యాప్తంగా పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు విద్యార్థుల మేధస్సుకు పదును వంటిదని, ఈ ప్రయోగాలు నేటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. చిత్తూరు జిల్లా పరిషత్ సాంఘిక సంక్షేమ సలహాదారు అమర్నాథ్ శ్రీనివాస్, వి.కోట విద్యా నికేతన్ జూనియర్ కాలేజీ, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణిత దినోత్సవ వేడుకలు

చిత్తూరు టౌన్: ముందస్తుగా గణిత దినోత్సవాన్ని బృందావనం స్కూల్లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి శనివారం రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నిత్యజీవితంలో గణితం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఆడిపాడి అలరించారు. రూబిక్స్ క్యూబ్స్‌లో మొదటి బహుమతిని 9వ తరగతి విద్యార్థి సెల్వకుమార్ పొందగా రెండవ బహుమతిని 9వ తరగతి పూర్ణిమ సాధించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి ప్రోత్సహించారు.



చిత్తూరు బృందావన్ స్కూల్‌లో..

23, 24 తేదీల్లో ప్రత్యేక గుర్తింపు శిబిరాలు

- కడా పీడీ వికాస్ మర్మత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్

ఈనెల 23, 24 తేదీలలో విభిన్న ప్రతిభావంతులకు పరికరాల పంపిణీ కొరకు ప్రత్యేక గుర్తింపు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ జీవన పరికరాలు పంపిణి కొరకు జిల్లా పరిపాలనా యంత్రాంగం వారి సహకారంతో భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ వారు కుప్పం నియోజకవర్గంలో అర్హత, అవసరత కలిగిన దివ్యాంగులకు, వయోవృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులు పరీక్షించి ఎంపిక చేసేందుకు ప్రత్యేక గుర్తింపు శిబిరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 23వ తేదీ సోమవారం కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే శిబిరంలో కుప్పం, గుడుపల్లి మండలాలలోని వారు, 24వ తేదీ మంగళవారం రామకుప్పం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని రామకుప్పం, శాంతిపురం మండలంలోని దివ్యాంగులు, వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్థాంతరంగా ముగిసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం రసాభాసగా ముగిసింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టిడిపి, వైసిపి కౌన్సిలర్లు హాజరయ్యారు. 2025- 26వ సంవత్సరానికి గానూ జరిగిన బడ్జెట్ సమావేశాల్లో అధికారుల తీరుపై కౌన్సిలర్లు మండిపడ్డారు. ముఖ్యంగా ఎంపీ నిధుల కింద మంజూరైన పనులు రద్దు చేసి మళ్ళీ టెండర్లు పిలవడంపై తమకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఓ దశలో అసలు ఏమి జరుగుతుందో తెలీని గందరగోళ పరిస్థితి నెలకొంది. అధికారులు సర్దిచెప్పినా తీవ్ర వాగ్వాదం నెలకొనడంతో సమావేశం అర్థాంతరంగా ముగించారు.



కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల వాగ్వాదం

ఉపాధి హామీ పనులు తనిఖీ

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం గ్రామపంచాయతీలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఎంపీడీవో బాలాజీ, ఏపీవో మురుగేష్ తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ పండ్ల మొక్కలకు, రింగ్ ట్రెంజ్ పనుల వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని, ఉపాధి హామీ ద్వారా రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టడం ద్వారా పంటలను, పండ్లతోటలను సంరక్షించుకోవచ్చని సూచించారు. అలాగే కోగిలేరు గ్రామపంచాయతీలో జరుగుతున్న గోకులం షెడ్డుల పనులను తనిఖీ చేశారు. 213 షెడ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 25 షెడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. మండలంలో 2829 రైతులకు గాను ఇప్పటికీ 317 మందికి ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. అలాగే చలమంగళం గ్రామపంచాయతీలో సచివాలయ సిబ్బంది ద్వారా జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి- సదుం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌పిడిసిఎల్ ఏఈ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఇంధనం పొదుపుపై వ్యాస రచన పోటీ నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.విజయ్ కుమార్‌రెడ్డి, బి.సుబ్రమణ్యం, ఏఈచంద్రశేఖర్ బహుమతులను అందజేశారు. లైన్ ఇన్స్పెక్టర్ బాబు, లైన్‌మెన్ ధనశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ హరి ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల కోసం ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - పెద్దపంజాణి: అంగన్వాడీలో చేరిన చిన్న పిల్లలకు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు ఎంపీడీవో బాలాజీ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్ పరిధిలో పెద్దపంజాణి సచివాలయ సిబ్బంది మహిళా పోలీసులు, అంగన్వాడీ వర్కర్ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పెద్దపంజాణి గ్రామంలో జరుగుతున్న అంగన్వాడీ పిల్లలకు స్పెషల్ ఆధార్ నమోదు, జనన ధ్రువీకరణ పత్రం నమోదు ప్రక్రియను ఎంపీడీవో బాలాజీ పరిశీలించారు. సెంటర్లోని పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించాలని ప్రభుత్వం ఆదేశించిందని తల్లిదండ్రులు ఈ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేయించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలో 322 మంది అంగన్వాడీ పిల్లలకు ధ్రువీకరణ పత్రాల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం ఉద్యోగ అవకాశాలు, దీర్ఘకాలిక ఇంటర్న్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీసిటిలోని వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, డిఆర్‌డిఏ స్కిల్ డెవలప్‌మెంట్ ఉమ్మడి జిల్లా అధికారులు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటి హెచ్‌ఆర్ శంకర్, డిఆర్‌డిఏ కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు, అర్హతలు, ఎంపిక, నైపుణ్యాలు, ప్రక్రియ గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎల్‌పి లత, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేష్, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ వి.నాగేశ్వరరావు, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.శంకర్ రెడ్డి, డాక్టర్ ఎసి.భరణినాథ రెడ్డి, వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీకే బద్రినారాయణకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రముఖ పారిశ్రామిక వేత్త, రాజకీయ నాయకులు, ఆర్‌కె విద్యాలయ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల, సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలల కరస్పాడెంట్ డికే బద్రినారాయణ జన్మదిన వేడుకలను శనివారం బివి రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘ నాయకులు, తెలుగుదేశం, జనసేన నాయకులు, ఆర్‌కె కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.రమేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


గ్రామీణుల అభివృద్ధే లక్ష్యం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిఎం చంద్రశేఖరన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, యాదమరి: గ్రామీణుల అభివృద్ధే లక్ష్యంగా ఆర్థిక తోడ్పాటును అందిస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు హెడ్ ఆఫీస్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ఇండియన్ బ్యాంకు ఆర్‌బిడి జిఎం చంద్రశేఖరన్ అన్నారు. స్థానిక వేలూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని శనివారం జిఎం.చంద్రశేఖరన్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు ఛైర్మెన్ ప్రసాద్, జనరల్ మేనేజర్ ప్రభాకరన్, రీజనల్ మేనేజర్ కిషోర్ పట్నాయక్, బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణారెడ్డి, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియ బోర్డు
డైరెక్టర్‌గా వేణుగోపాల్



ప్రజాశక్తి- కుప్పంటౌన్: రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్‌గా కుప్పం పట్టణానికి చెందిన కెఎం.వేణుగోపాల్‌ను నియమిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నమ్మి పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, లోకేష్‌కు, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు, ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంకు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వన్యకుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణ పరిధిలో పారిశుధ్య కార్మికులు దోమల నివారణ చర్యలను కొనసాగిస్తున్నారు. శనివారం ఉదయం పట్టణంలో పలుచోట్ల పారిశుధ్య కార్మికులు నిర్వహిస్తున్న దోమల నివారణ మందుల పిచ్చికారి పనులను కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. వారంలో రెండు రోజులు మంగళ, శనివారాల్లో పురపాలక సంఘం తరపున దోమల నివారణ మందులను పిచికారి చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పూతలపట్టు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 52వ జన్మదిన వేడుకలను మండలంలోని పి.కొత్తకోట గ్రామంలో మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జి సునీల్‌కుమార్, సీనియర్ నాయకులు బాబురెడ్డి, రాజరత్నం రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి, జడ్పిటిసి దేవిక ఘనంగా నిర్వహించారు. ఎం.బండపల్లిలోనూ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

బంగారుపాళ్యం: మాజీ ఎమ్మెల్యేలు లలిత కుమారి, సునీల్‌కుమార్, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి, ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం 500 మంది అన్నదానం చేశారు. వేల్కూర్ బాబురెడ్డి, చిన్నమరెడ్డి, సురేంద్రర్ రెడ్డి, బలరామిరెడ్డి, గోవింద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు. తూగుండ్రం పంచాయతీ కండ్రిగలోనూ 400 మంది అన్నదానం చేశారు.

వెదురుకుప్పం: మండలంలోని కురివికుప్పం పంచాయతీ అడపాలబైలు గ్రామంలో కామసాని భీమశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. వేణుగోపాల రెడ్డి, మాజీ సర్పంచ్ దేవరాజుల రెడ్డి, సోమశేఖర్, లోకేష్, రామమూర్తి, ఢిల్లీ ప్రసాద్ రెడ్డి, గౌరీ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.



కార్వేటినగరంలో..

రొంపిచర్ల: మండలంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రొంపిచర్ల మండలం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జడ్పిటిసి రెడ్డీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు చెంచురెడ్డి భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే పులిచెర్ల మండలం కల్లూరు పట్టణం పీలేరు - చిత్తూరు మార్గంలోని పెట్రోల్ బంకు వద్ద మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ సురేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

కార్వేటినగరం: గాండ్లమిట్ట కూడలిలో ఎంపీపీ లతబాలాజీ, గంగాధరనెల్లూరు ఇన్చార్జి కృపాలక్ష్మి, సర్పంచ్ ధనంజయవర్మ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్రాజు ఆధ్వర్యంలో సర్పంచ్లు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో కలసి జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. సింగిల్విండో అధ్యక్షులు లోకనాధరెడి, పట్నం ప్రభాకరరెడ్డి, లోకనాధరెడ్డి, శేషాద్రి, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండల కన్వీనర్ బాగరెడ్డి ఆధ్వర్యంలో జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, శంకరప్ప, తమ్మి రెడ్డి, హరినాథ్, నాగ శంకర్‌రెడ్డి, రమేష్ బాబు పాల్గొన్నారు. మండల పరిధిలోని జీవదాత వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సర్పంచ్ శిరీష నాగ శంకర్‌రెడ్డి, సర్పంచ్ భార్గవ్ పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అలాగే కరసనపల్లి పంచాయతీలోని 20 కేజీల భారీ కేకును కట్ చేసి అన్నదానం నిర్వహించారు. వెంకటరత్నం, సలీం పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ పురం: మండలంలోని ఎస్‌ఆర్ పురం, 49 కొత్తపల్లి మిట్ట, చిన్నతయ్యూరు గ్రామాలలో జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఎంపీపీ సరిత, శ్యామ్, సర్పంచులు కుప్పయ్య, డివి డిల్లెయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మీ కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. **సదుం:** బస్టాండ్ కూడలిలో జిల్లా మాజీ జెడ్‌పి వైస్‌చైర్మన్ పి.పెద్దిరెడ్డి, జడ్పీటిసి సభ్యులు సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. కృష్ణారెడ్డి, రెడ్డప్పరెడ్డి, ప్రకాష్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, ఆచారి రమణ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి గ్రామంలో సర్పంచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డప్ప భారీ కేకును కట్ చేసి, అన్నదానం చేశారు.



పెద్దపంజాణిలో..



ఎస్‌ఆర్‌పురంలో..



బైరెడ్డిపల్లిలో..

డిగ్రీ కళాశాలకు బి ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి- పుంగనూరు : పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బి ప్లస్ గ్రేడ్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో శనివారం కళాశాల ప్లానింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. శుభారం డిగ్రీ కళాశాలకు నాక్‌లో బి ప్లస్ గ్రేడ్ రావడం చాలా సంతోషమని కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో కళాశాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ను సాలవుతూ సన్మానించారు. కమిటీ సభ్యులతో పాటు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, విజయ శంకర్ పాల్గొన్నారు.

హెల్మెట్ పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: చిత్తూరు నగరంలోని విజయం విద్యాసంస్థల ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీని, డీఎస్పీ శ్రీసాయినాథ్, ట్రాఫిక్ సిఐ నిత్య బాబు ప్రారంభించారు. స్థానిక నాయుడు బిల్డింగ్స్ విజయం డిగ్రీ కళాశాల నుంచి వంద మందితో ప్రారంభమైన ఈర్యాలీ దర్గా కూడలి మీదుగా కోర్టు వరకు సాగింది. ఈ సందర్భంగా విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల్లో సురక్షిత ప్రయాణం చేయాలని. పొరపాటున ఏదైనా ప్రమాదాలు జరిగిన రక్షణ కవచంలా హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేసి తమ ప్రాణాలను కాపాడుకోవాలని అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ సునీత నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అంతకు ముందు స్థానిక పాస్టర్లు క్రిస్మస్ ప్రాముఖ్యతను క్రీస్తు జననం గురించి తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బట్టలను పంపిణీ చేశారు. కమిషనర్ రమణారెడ్డి, తహశీల్దార్ ఇన్బనాథన్, సీఐ నరసింహరాజు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు కిషోర గౌడ, సుబ్రహ్మణ్యం గౌడ్, గిరిబాబు, బ్రహ్మయ్య, ఖాజా, చాంద్బాషా, మదన్ పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

గంగాధర నెల్లూరు: బిషప్ మహిమైదాస్‌కు చెందిన మహిమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు పాస్టర్లకు చీరలు పంపిణీ చేశారు. ప్రతి క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ట్రస్ట్ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఆర్చ్ బిషప్ బెన్నీ ఏసు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఏ కృషి అభినందనీయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగర అభివృద్ధి కోసం ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్ చేస్తున్న కృషి అభినందనీయమని చిత్తూరు స్మార్ట్ సిటీ అండ్ డెవలప్మెంట్ సొసైటీ బృందం నేతలు తాండవ మూర్తి, శివకుమార్, సత్య, శోభారాణి, చంద్రబాబు, కుమరేషన్ తెలిపారు. శనివారం ఎంఎల్‌ఏని కలసి అభినందించారు.

పీఆర్ వన్ యాప్ ద్వారా పంచాయతీ విధుల పర్యవేక్షణ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: పిఆర్ వన్ యాప్ ద్వారా పంచాయతీ విధుల పర్యవేక్షణ చేయాలని డిపిఓ సుధాకర్ రావు కోరారు. శనివారం మండల పరిధిలోని పెద్దకాల్వ సచివాలయాన్ని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డితో కలిసి డీపీఓ సందర్శించారు. పంచాయతీలలో నిరుపయోగంగా ఉన్న సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను డిసెంబర్ 31 లోగా ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలని, ప్రతి గురువారం వర్మీ కంపోస్ట్‌లో ఉన్న చెత్తను అమ్మి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అకౌంట్లో జమ చేయాలన్నారు. పంచాయతీ ఇతర ఆర్థిక వ్యవహారాలను స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో చేపట్టడం జరుగుతుందన్నారు. ఎంపీడీవోలు ప్రతివారం కొన్ని ఎస్బ్ల్యు డబ్ల్యు డీసీలను సందర్శించి ప్రజలు ఎలాంటి వ్యాధులకు గురి కాకుండా చూడాలన్నారు. గ్రామాలలో చెత్తను వాహనాల ద్వారా తొలగించాలని, గ్రామ కమ్యూనిటీ సెంటర్ వద్ద, రోడ్డుకు ఇరువైపులా ప్రజలు సంచరించే చోట చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు మండల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దకాల్వ గ్రామ సచివాలయంలో డిపిఓ సుధాకర్ రావు

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం: డీఈవో

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుపై స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన ఇంటర్ కళాశాల అధికారి సయ్యద్ మౌలాలి, డీవైఈవోలు, ఎంఈవోలు అక్షయపాత్ర ఫౌండేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో వరలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వఆదేశాల మేరకు త్వరలో మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారుల సమావేశం నిర్వహించి నిర్వహణపై సమీక్షించడం జరిగిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వరలక్ష్మి

'ధ్యానం'తో ప్రశాంత జీవనం



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ధ్యానం చేయడం వల్ల ప్రశాంత జీవనాన్ని గడపవచ్చు అని, ధ్యానంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్తూరు సంతపేటలోని రామచంద్ర మిషన్ యోగాశ్రమంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత పెంచుకోవడంతో పాటు మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. ప్రధానంగా విద్యార్థులు, యువత యోగ, ధ్యానంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రామచంద్ర మిషన్ ప్రతినిధులు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత పాల్గొన్నారు.

కుప్పం రూరల్: యోగా మానవాళి జీవితంలో భాగం కావాలని కుప్పం మండలం చందం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మురళి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులో యోగా ధ్యాన్యం చేయించారు.



నగరిలో రక్తదాన శిబిరం



ప్రజాశక్తి-విజయపురం (నగరి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ)లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసింది. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, ఎస్సిసి, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సహకారంతో ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, స్థానిక ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ మాట్లాడుతూ రక్తదానం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం ఎంతో అవసరమని, ఈశిబిరం ద్వారా అనేక ప్రాణాలు రక్షించబడతాయని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భాస్కర్ రాజు రక్తదానం ఒక గొప్ప ఉదాత్తమైన చర్య అని, ఆసుపత్రులకు నిరంతరం రక్తం అవసరం ఉంటుందని గుర్తు చేశారు. ఆర్ఆర్సి కోఆర్డినేటర్ డాక్టర్ జి.స్వాతి, ఎస్సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి. భాస్కర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఇ. గోపి, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజా రాజేశ్వరి, డాక్టర్ మంజుల (సెక్రటరీ), ప్రభాకర్ రాజు, హరిప్రసాద్ వర్మ, సభ్యులు మహ్మద్ సఫీ, మోహన్, వాసు పాల్గొన్నారు.

శ్మశానాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు: తహశీల్దారు



బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: శ్మశానాలను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. శనివారం మండలంలోని టేకుమంద గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, శ్మశానాలను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్ రత్నయ్య, ఆర్ఐ మధుసూదన్, మండల సర్వేయర్ లావణ్య, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి భూ సమస్యలపై వినితిపత్రాలు అందినట్లు తహశీల్దార్ రమేష్ బాబు తెలిపారు. సదస్సులో అందిన అర్జీలపై త్వరలోనే పరిష్కారం చూపుతామని తెలిపారు.

ఎస్ఆర్ పురం: భూ సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని ప్రతి గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి సదస్సు నిర్వహిస్తారని, భూములకు సంబంధించి సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ లోకనాథపిళ్ళై తెలిపారు. శనివారం ఆరిమాకులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిటి రవికుమార్, సర్వేయర్, వీఆర్వో సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం: సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సు లక్ష్యమని మండల తహశీల్దార్ కొమ్ము నాగరాజు తెలిపారు. శనివారం కార్వేటినగరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. డిటి త్యాగరాజు, ఆర్ఐ కిరణ్ కుమార్, ఇన్చార్జి ఈవోపిఆర్‌డి నాగరత్నమ్మ, వీఆర్వోలు తేజ, బాలు సింగ్ పాల్గొన్నారు.



ఎస్ఆర్‌పురంలో..

క్రైం న్యూస్



గంజాయి కేసులో పట్టుబడ్డ ముద్దాయిలను చూపుతున్న సిఐ

గంజాయి కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.1,20,000లు విలువైన సుమారు 8 కేజీల గంజాయిని చిత్తూరు 2వ పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిఐ నెట్టి కంటయ్య తెలిపిన వివరాల మేరకు.. తమకు అందిన రహస్య సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3.20 గంటలకు ఇరువారం -కోడిగుట్ట రహదారిలో సిఐ నెట్టికంటయ్య, ఎస్ఐ ప్రసాద్ పోలీస్ సిబ్బంది దాడిచేసి అమరనాథ్, దేవేంద్ర, లోకేష్, కార్తీక్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 8 కేజీల గంజాయి, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల విచారించగా వారు బంగారుపాళ్యం మండలం చీకురుపల్లి గ్రామానికి చెందిన వాసు అనే వ్యక్తితో కలిసి గంజాయి అక్రమ రవాణా చేపడుతున్నారని, వైజాగ్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తుల నుండి గంజాయిని తీసుకువచ్చి, చిత్తూరులో చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సదరు వాసు అనే వ్యక్తి పరారీలో ఉండగా, అతని కోసం పోలీసుల బృందాలు గాలిస్తున్నట్లు సిఐ తెలిపారు.

ఉన్మాది హత్య

- కుళ్ళిన మృతదేహం- కుటుంబ సభ్యులపైనే అనుమానం..

ప్రజాశక్తి- పుంగనూరు: గుర్తుతెలియని వ్యక్తిని హత్యచేసి పుంగనూరు మండలం చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం అటవీ ప్రాంతంలో పడవేసినట్లు పశువుల కాపరులు గ్రామస్తులకు తెలిపారు. దీంతో విఆర్ఓ శ్రీనివాసులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి సీఐ శ్రీనివాసులు చెరుకుని మృతుని వద్ద ఉన్న ఆధారాలు సేకరించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు మదనపల్లె మండలం కోళ్ల బైలు పంచాయతీ దిగువ మామిడి గుంపలపల్లి గ్రామానికి చెందిన గంగులురెడ్డి, తల్లి నారాయణమ్మ కుమారుడు సోమశేఖర్ రెడ్డి (36)గా గుర్తించారు. 20 రోజుల క్రితమే హత్యచేసి మృతదేహన్ని అటవీ ప్రాంతంలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు మద్యానికి బానిసై కుటుంబీకులను, గ్రామస్తులను నిత్యం వేధిస్తూ హింసించేవాడని తెలిపారు. ఇతనికి 20 ఏళ్ల వయసులోనేపెళ్లి అయిందని భార్య, కుమారుడు ఉన్నారని తెలపారు. పదేళ్ల క్రితం మృతుడు పెట్టే బాధను తట్టుకోలేక తల్లీకొడుకు బావిలో పడి ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని, అయినప్పటికీ ఇతనిలో మార్పు లేకపోవడంతో ఇతని అన్న కూడా వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడని తెలిపారు. ఇతని హింస రోజురోజుకీ పెరిగిపోవడంతో కుటుంబసభ్యులే హత్య చేయించి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలంలోని మృతదేహనికి వైద్యులు పంచనామా నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

రూ.20లక్షలు విలువ గల నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి- వెదురుకుప్పం/కార్వేటినగరం: రైతులను మోసం చేసి వ్యక్తి అరెస్టు చేసినట్లు కార్వేటినగరం సిఐ హనుమంతప్ప తెలిపారు. శనివారం పోలీస్టుస్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సిఐ మాట్లాడుతూ గుండ్రాజు ఇండ్లు గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరిస్తూ రైతులు ట్రాక్టర్లను ఇస్తే వారికి బాడుగ డబ్బులు ఇప్పిస్తానని, ఈఎంఐలు సైతం కట్టిస్తానని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. రైతుల వ్యవసాయ ట్రాక్టర్లను తీసుకొని ఏకాంబరం, చిన్నా, శంకర్ అనే ముగ్గురు వ్యక్తులకు ఇప్పించాడు. వారు రైతులను మోసం చేసి ట్రాక్టర్లను ఇవ్వకుండా, ఈఎంఐలు కట్టకుండా తిరిగి రైతులపై బెదిరింపు చర్యలకు పాల్పడారు. దీంతో వారు కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. శనివారం సదరు ముద్దాయిలు మురళి, ఏకాంబరం, చిన్నా, శంకర్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ.20లక్షలు విలువ చేసే నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యజమానులైన రైతులకు అప్పగించారు. సిఐ రైతులు ఇటువంటి దళారుల మాటలు విని మోసపోకుండా ఉండాలని సూచించారు.